


నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com
EVENING EDITION
www.suryaa.com పేజీలు: 02 4PM

## వాలెంటైన్స్ వీక్.. నేడు చాక్లెట్ డే



వాలెంటైన్స్ వీక్‌లో ఒక్కో రోజుకి ఒక్కో ప్రత్యేకత ఉంది . ఇవాళ మూడో రోజు (ఫిబ్రవరి 9) ని చాక్లెట్ డే అంటారు. ప్రేమ జంటలు ఒకరికొకరు చాక్లెట్లు పంచుకునే రోజు ఇది. తమ ప్రేమలోని చేదు అనుభవాలను మర్చిపోయి తీపి జ్ఞాపకాలనే గుర్తుపెట్టుకోవాలని ఇష్టమైన వారికి చాక్లెట్లను బహుమతిగా ఇస్తారు. ప్రేమలాగే చాక్లెట్లు తీపి, రుచికరమైనవి. ఇవి ప్రేమికులకు మధురమైన జ్ఞాపకాలను మిగుల్చుతాయి.

## 11 నుంచి పెళ్లిళ్ల సీజన్ స్టార్ట్



ఈ నెల నుంచి పెళ్లి ముహూర్తాలు ప్రారంభమవుతుండడంతో పెళ్లిళ్ల సీజన్ షురూ కానుంది. శనివారం నుంచి మాఘమాసం వచ్చేస్తోంది. దీంతో వివాహాలు, గృహ ప్రవేశాలు, శంకుస్థాపనలు జరుగనున్నాయి. ఈనెల 11 నుంచి ఏప్రిల్ 4 వరకు పండితులు ముహూర్తాలు నిర్ణయిస్తున్నారు. అయితే ఈసారి ఉగాది దాటిన తర్వాత రెండు నెలలపాటు శుభ కార్యక్రమాలకు బ్రేక్ పడనుంది. ఏప్రిల్ 30 నుంచి ప్రారంభమవుతున్న ముఢం జూలై 10 వరకు ఉండటంతో శ్రావణమాసానికి కొందరు వాయిదా వేసుకుంటున్నారని పండితులు చెబుతున్నారు.

## ప్రేక్షకులు లేక లాల్ సలాం మార్నింగ్ షోస్ రద్దు



కోలీవుడ్ సినిమా నుంచి లేటెస్ట్‌గా రిలీజ్ కి వచ్చిన లేటెస్ట్ చిత్రం “లాల్ సలాం”. సూపర్ స్టార్ రజినీకాంత్ “జైలర్” లాంటి సెన్సేషనల్ సక్సెస్ తర్వాత చేసిన సినిమా ఇది కాగా ఇందులో తాను గెస్ట్ రోల్ లో నటించారు. మరి విష్ణు విశాల్ అలాగే విక్రాంత్ సంతోష్ లు మెయిన్ లీడ్ లో ఐశ్వర్య రజినీకాంత్ దర్శకత్వంలో తెరకెక్కించిన ఈ చిత్రానికి తెలుగు తో పాటుగా తమిళ్ లో కూడా చాలా తక్కువ బజ్ ఉంది. మరి తెలుగులో ఈ చిత్రం నేడు విడుదల కాగా ఇప్పుడు షాకింగ్ అనుభవం ఎదురైంది. ఈ చిత్రానికి థియేటర్స్ లో ఆడియెన్స్ లేక తెలుగు స్టేట్స్ లో పలు చోట్ల మార్నింగ్ షోస్ ని థియేటర్స్ వారు క్యాన్సిల్ చేసుకున్నారు. దీనితో టికెట్ బుక్ చేసిన కొంతమందికి షో రద్దు చేసినందుకు గాను సారి చెప్పి డబ్బులు రిఫండ్ చేస్తున్నట్టుగా తెలిపారు. మరి రజినీ లాంటి స్టార్ ఉన్నా కూడా ఈ సినిమాకి ఇలాంటి రెస్పాన్స్ రావడం షాకింగ్ అనే చెప్పాలి.

## మాజీ ప్రధాని పీవీకి భారత రత్న



మాజీ ప్రధానమంత్రి దివంగత పీవీ నరసింహరావుకు భారతరత్న వరించింది. కేంద్ర ప్రభుత్వం పీవీకి భారతరత్నను శుక్రవారం ప్రకటించింది. పీవీతో పాటు మాజీ ప్రధాని చౌదరీ చరణ్ సింగ్, వ్యవసాయ శాస్త్రవేత్త ఎంఎస్ స్వామినాథన్‌కు కేంద్ర ప్రభుత్వం భారత రత్న ప్రకటించిన విషయాన్ని ప్రధాని నరేంద్ర మోదీ ట్వీటర్ వేదికగా వెల్లడించారు.వరంగల్ జిల్లా నర్సింపేట (మ) లక్నేపల్లిలో 1921 జూన్ 28న జన్మించిన పీవీ నరసింహారావు 1991లో భారత ఆర్థిక సంస్కరణలకు ఆద్యుడయ్యాయడు.

## మహిళా ఖైదీల గర్భంపై హైకోర్టు సీరియస్!




దారుణంగా మారిన ఘటన కలకలం రేపుతోంది. రాష్ట్రవ్యాప్తంగా వివిధ దిద్దుబాటు కేంద్రాల్లో మహిళా ఖైదీలు గర్భం దాల్చడం, 196 మంది పిల్లలు జన్మించడంతో మహిళా ఖైదీల దుస్థితికి బాధ్యులెవరు అనే చర్చకు దారి తీసింది. జైళ్లలో ఉన్న కొంతమంది మహిళా ఖైదీలు గర్బం దాల్చిన ఘటన పశ్చిమ బెంగాల్‌లో పెను దుమారం రేపుతోంది. ఈ వ్యవహారంపై కోలకత్తా హైకోర్టు సీరియస్‌గా స్పందించింది. రాష్ట్రంలోని వివిధ జైళ్లను పరిశీలించి అమికస్ క్యూరీ గురువారం అందించిన నివేదికపై హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. జైళ్లలో మహిళా ఖైదీలు గర్భం దాల్చి, బిడ్డల్ని కంటున్న ఘటనలపై దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని విచారించిన చీఫ్ జస్టిస్ టీఎస్ శివజ్ఞానం, జస్టిస్ సుప్రతీమ్ భట్టాచార్యలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం జైలు సంస్కరణలపై ఆందోళన వ్యక్తం చేసింది.

## శివసేన(యూబీటీ) నేతపై వీడియో లైవ్‌లో కాల్పులు



శివసేన (ఠాక్రే) వర్గానికి చెందిన నాయకుడు అభిషేక్ ఘోసల్కర్ దారుణం చంపబడ్డారు. ఆయన లైవ్ వీడియోలో మాట్లాడున్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తి కాల్పులు జరిపారు. తాజాగా ఈ ఘటన సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. వ్యాపారవేత్త మోరిస్ నోరోన్హా అనుమానితుడిగా భావిస్తున్నారు. ఆయన కార్యాలయంలోనే ఈ కాల్పులు జరగటం గమనార్హం. నోరోన్హా కూడా చనిపోయాడని, తనను తాను కాల్చుకున్నాడని వార్తలు వస్తున్నాయి. గత వారంలో బీజేపీ ఎమ్మెల్యే ఒకరు శివసేన (షిండే) వర్గం నేతపై పోలీస్ స్టేషన్‌లోనే కాల్పులు జరిపిన విషయం తెలిసిందే.

## ఈగల్ మూవీ రివ్యూ




ఢిల్లీలో పని చేసే నళిని రావు (అనుపమ) అనుకోకుండా ఒక స్పెషల్ కాటన్ క్లాత్ చూస్తుంది. అది కొనుగోలు చేసే సమయంలో ఆ క్లాత్ పండించే ఊరికి సంబంధించిన ఒక ఆసక్తికరమైన విషయం తెలుసుకుంటుంది. ఆ క్లాత్ కి విపరీతమైన పబ్లిసిటీ చేసి అందరికీ అందుబాటులోకి తీసుకొచ్చిన వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మిస్ అయ్యాడు అని తెలుసుకుంటుంది. అదే విషయం మీద ఆమె పేపర్లో ఒక ఆర్టికల్ రాయడంతో సీబీఐ రంగంలోకి దిగి సదరు పత్రిక మొత్తాన్ని ఒకరోజు ముద్రించకుండా అడ్డుకుంటుంది. దీంతో అసలు ఆ మిస్సయిన సహదేవ్ వర్మ ఎవరు? ఎందుకు అతని గురించి పేపర్లో రాస్తే సీబీఐ రంగంలోకి దిగింది? అని తెలుసుకునేందుకు నళిని ఆంధ్రప్రదేశ్ మదనపల్లి తాలూకాలో ఉన్న తలకోన అటవీ ప్రాంతానికి వెళుతుంది. ఆ తర్వాత నళిని సహదేవ్ గురించి ఏం తెలుసుకుంది? ఎక్కడో యూరప్ లో సఫారీ తీసుకుని కాంట్రాక్టు కిల్లింగ్ చేసే స్నైపర్ సహదేవ్ వర్మ తలకోన అడవుల్లో ఏం చేస్తున్నాడు? కాంట్రాక్ట్ కిల్లింగ్స్ ఆపేసి పత్తిని పండిస్తూ చేనేత కార్మికులను ముందుకు తీసుకువెళ్లాలని ఎందుకు ప్రయత్నించాడు? అసలు అతని గురించి రాస్తే సీబీఐ కంగారు పడాల్సిన అవసరం ఏముంది? సహదేవ్ భార్య రచన(కావ్య)కి ఏమైంది? లాంటి విషయాలు తెలియాలంటే సినిమా మొత్తం చూడాల్సిందే. రవితేజ కెరీర్ లోనే మోస్ట్ అవైటెడ్ స్టైలిష్ ఎంటర్టైనర్ గా ఈగల్ సినిమాని ముందు నుంచి ప్రచారం చేస్తూ వచ్చారు. దానికి తగ్గట్టే టీజర్, ట్రైలర్ కట్స్ ఉండడంతో కచ్చితంగా సినిమా వేరే లెవల్ లో ఉంటుందని ఆయన అభిమానులు భావిస్తూ వచ్చారు. ఇక సినిమా విషయానికి వస్తే ఓపెనింగ్ షాట్ నుంచి సహదేవ్ వర్మ అదేనండి మన రవితేజ క్యారెక్టర్ మీద నెమ్మదిగా అంచనాలు పెంచుతూ తీసుకువెళ్లారు. నిజానికి ఫస్ట్ ఆఫ్ మొదట్లోనే రవితేజ క్యారెక్టర్ రివీల్ అవుతుంది అనుకుంటే అందుకు భిన్నంగా సినిమా చివరి వరకు అతని క్యారెక్టర్ ని ప్రేక్షకులకు పరిచయం చేయడం కాస్త ఆసక్తికరంగా అనిపిస్తుంది. సాధారణంగా కమర్షియల్ సినిమా ఫార్మాట్ లో ఫస్ట్ ఆఫ్ లో హీరో క్యారెక్టర్ ను రివిల్ చేసి తర్వాత హీరోయిజం చూపిస్తూ అతనితో సినిమా మొత్తం నడిపించే ప్రయత్నం చేస్తారు. కానీ ఈ సినిమా విషయంలో మాత్రం ఫస్ట్ ఆఫ్ నుంచి హీరో మీద ఎలివేషన్లు పెంచుతూ పెంచుతూ చివరి వరకు సినిమా నడిపించారు.. కాంట్రాక్ట్ కిల్లింగ్ చేసుకుంటూ డబ్బు వెనకేసుకుంటున్న ఒక వ్యక్తి ప్రేమలో పడి మంచిగా మారదామనుకున్న సమయంలో ఆమె దూరమైతే అప్పటి వరకు తాను చేసిన పని వదిలేసి అక్రమ ఆయుధాలు అరికట్టడమే పనిగా పెట్టుకుంటాడు. దాని కోసం శత్రుదుర్భేధ్యమైన ఒక కోట నిర్మించుకొని ఇండియా వ్యాప్తంగా జరిగే అన్ని అక్రమ ఆయుధాల డీలింగ్స్ లో ఇన్వాల్వ్ అవుతూ ఆ అక్రమ ఆయుధాలు దొంగిలిస్తూ ఉంటాడు. అక్రమ ఆయుధాలు దుర్మార్గుల చేతికి వెళితే అవి ఎంతో మంది అమాయకుల ప్రాణాలు బలి తీసుకుంటున్నాయి అనే కాన్సెప్ట్ తో సినిమా మొత్తాన్ని నడిపించారు. నిజానికి మన ఇండియాతో పోలిస్తే అమెరికా, యూరప్ అలాగే మరికొన్ని ఇతర దేశాల్లో గన్ కల్చర్ బాగా ఎక్కువ. నిన్నటికి నిన్న కూడా ఒక హైదరాబాద్ యువకుడి మీద అమెరికాలో దాడి చేసి దుండగులు డబ్బు దోచుకున్న ఘటన విన్నాం. ఇలా డైలీ లైఫ్ నుంచి ఇన్స్పైర్ అయ్యి ఈ కథ రాసుకున్నారేమో అనిపించింది. ఇక హీరో ఎలివేషన్ విషయానికి వస్తే కేజీఎఫ్ ఇప్పటికే ఒక స్టాండర్డ్ సెట్ చేసింది. ఈ సినిమా కూడా కొంత దానినే ఫాలో అయినట్లు అనిపించింది. ముఖ్యంగా గన్స్ డిజైన్ చేసిన విధానం కూడా అక్కడ నుంచే ఇన్స్పైర్ అయినట్టుగా అనిపిస్తుంది. అయితే రవితేజ మార్క్ కామెడీ ఈ సినిమాలో ఏ మాత్రం ఎక్స్పెక్ట్ చేయవద్దు. సైలెంట్‌గా కళ్లతోనే కథ నడిపించే హీరోగా రవితేజ కాస్త తన గత సినిమాలకు భిన్నంగా కనిపించాడు. స్క్రీన్ ప్లే కాస్త ట్విస్ట్ చేసి ప్రేక్షకుల ముందుకు తీసుకు రావాలి అనుకున్నారో ఏమో తెలియదు కానీ చాప్టర్లు పెట్టి అర్థం కాని పేర్లతో కొంచెం కన్ఫ్యూజ్ చేశారు. కానీ ఓవరాల్ గా ఒక మాటలో చెప్పాలంటే అక్రమ ఆయుధాల డీలింగ్స్ అన్నింటిని క్యాన్సిల్ చేస్తూ వాటిని దోచుకుంటున్న ఒక వ్యక్తి గురించి సమాజంలో భిన్న కోణాలు ఎలా ఏర్పడ్డాయి? చివరికి ఆ వ్యక్తిని అంత మొందించడానికి ప్రభుత్వం ఎలా రంగంలోకి దిగింది లాంటి విషయాలను కన్విన్సింగ్ గా తెరకెక్కించడంలో కార్తీక్ పూర్తి స్థాయిలో సఫలమయ్యాడు. అంతేకాక రవితేజను మోస్ట్ స్టైలిష్ అవతార్ లో చూపించి ఆయన ఫ్యాన్స్ కి ఫుల్ మీల్స్ పెట్టాడు. అయితే పద ప్రయోగం అక్కడక్కడ కాస్త ఆలోచింపజేసే విధంగా ఉంది. నిజానికి కొన్ని లాజిక్ కి దూరం అనిపించినా ఓవరాల్ గా సినిమా మొత్తం మీద ఎంగేజ్ చేసే విధంగా ఉంది. నటీనటుల విషయానికి వస్తే రవితేజ తన రొటీన్ పాత్రల కంటే భిన్నంగా ఈ సహదేవ్ వర్మ పాత్రలో నటించి ఆకట్టుకున్నాడు. ఆయనకు ఎక్కువ డైలాగ్స్ ఉండవు కానీ తన భావాలను కళ్లతోనే పలికించే పాత్రలో రవితేజ కనిపించాడు. ఇక రవితేజ చాలా స్టైలిష్ గా కనిపించాడు అని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు. అనుపమ పాత్ర ఒక ఇన్వెస్టిగేటివ్ జర్నలిస్ట్ తరహా పాత్ర కావడంతో ఆమె కోణం నుంచి సినిమా మొత్తం నడుస్తుంది. దాదాపుగా సినిమా మొత్తం ఆమె పాత్ర కనిపిస్తుంది. నటనకు పెద్దగా స్కోప్ ఉన్న పాత్ర కాదు గాని సినిమాని నేరేట్ చేసే విధానంలో ఆకట్టుకుంది. నవదీప్ కి చాలా రోజుల తర్వాత ఫుల్ లెంత్ రోల్ దొరికింది. వినయ్ రాయ్ పాత్ర చిన్నదైనా తన పాత్ర పరిధి మేరకు నటించాడు. అవసరాల శ్రీనివాస్, మధుబాల, మిర్చి కిరణ్ వంటి వాళ్ల పాత్రలు కూడా పరిమితమైనా తమ పరిధి మేరకు ఆకట్టుకున్నారు. అజయ్ ఘోష్, శ్రీనివాస్ రెడ్డి, అమృతం అప్పాజీ వంటి వాళ్ల మధ్య కామెడీ ట్రాక్ ఆకట్టుకునే విధంగా ఉంది. ఇక టెక్నికల్ టీం విషయానికి వస్తే దేవ్ జాండ్ పాటలకన్నా సౌండ్ డిజైనింగ్ అదేవిధంగా బ్యాక్గ్రౌండ్ స్కోర్ ఆకట్టుకునేలా ఉంది. పాటలు కూడా ఆడు మచ్చ, గల్లంతు వంటివి వినడానికి మాత్రమే కాదు విజువల్ గా కూడా చాలా బాగున్నాయి.

## ఫ్రీ జర్నీతో మహిళలకు రూ.535 కోట్ల లబ్ధి



మహాలక్ష్మి పథకంలో భాగంగా ఈనెల 6 వరకు 15.21 కోట్ల మంది మహిళలు ఆర్టీసీలో ఫ్రీ జర్నీ చేశారని సంస్థ ఎండీ సజ్జనార్ వెల్లడించారు. మహిళలకు ఇప్పటి వరకు రూ.535.52 కోట్ల లబ్ధి చేకూరిందని గురువారం ఆయన ఓ ప్రకటనలో పేర్కొన్నారు. డిసెంబర్ 9న సీఎం రేవంత్ రెడ్డి ఫ్రీ జర్నీని ప్రారంభించగా, శుక్రవారం నాటికి రెండు నెలలు కానుంది. కాగా, ఆర్టీసీలో 100 కొత్త బస్సులు రానున్నాయి. ఇందులో ఎక్స్ ప్రెస్, పల్లెవెలుగు బస్సులు ఎక్కువ ఉన్నాయని అధికారులు చెప్పారు. వీటిని త్వరలోనే సీఎం చేతుల మీదుగా ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. కొత్త బస్సులు వస్తున్న నేపథ్యంలో మేడారం జాతరకు ఉపయోగపడతాయని అధికారులు అంటున్నారు.

## లాభాల్లో స్టాక్ మార్కెట్

అంతర్జాతీయ మార్కెట్లలోని మిశ్రమ సంకేతాల మధ్య దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు శుక్రవారం స్వల్ప నష్టాలతో ప్రారంభమయ్యాయి. కొనుగోళ్ల అండతో కాసేపటికే పుంజుకొని లాభాల్లోకి ఎగబాకాయి. ఉదయం 9:27 గంటల సమయంలో సెన్సెక్స్ 103 పాయింట్లు లాభపడి 71,532 వద్ద ట్రేడవుతోంది. నిఫ్టీ 38 పాయింట్లు పుంజుకొని 21,756 దగ్గర కొనసాగుతోంది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ రూ.82.97 వద్ద ప్రారంభమైంది.



## రామ్ చరణ్‌కు జోడిగా జాన్వీ



స్వర్గీయ శ్రీదేవి కూతురు జాన్వీ కపూర్‌ని తెలుగులో చూడాలని తెలుగు ప్రేక్షకుల సుదీర్ఘ నిరీక్షణ దేవరతో ముగియనుంది. ఈ సుందరి ప్రస్తుతం ఎన్టీఆర్ దేవర చిత్రంలో నటిస్తోంది. జాన్వీ కపూర్ గురించి మరో ఉత్తేజకరమైన వార్తలో, లేడీ మరొక బిగ్గీకి సైన్ ఇన్ చేసింది మరియు ఈసారి రామ్ చరణ్‌తో. రామ్ చరణ్ తదుపరి, RC16 ఉప్పెన ఫేమ్ బుచ్చి బాబు సనాతో ఉంది మరియు ప్రధాన హీరోయిన్ గురించి చాలా పుకార్లు వచ్చాయి. ఆ పుకార్లకు ముగింపు పలుకుతూ, ఉత్తరాంధ్ర నేపథ్యంలో సాగే పల్లెటూరి డ్రామాలో రామ్ చరణ్‌కి జోడీగా జాన్వీ కపూర్ నటిస్తుందని ఇక్కడ నిర్ధారణ అయింది. బుచ్చి బాబు సనా కథను జాన్వీ కపూర్‌కి వివరించినట్లు తెలిసింది మరియు యంగ్ టాలెంట్ రియాలిటీ RC16లో భాగం కావడానికి అంగీకరించింది. ప్రధాన పాత్రలో సమంత లేదా రాషా తదానిని మేకర్స్ పరిశీలిస్తున్నారనే పుకార్లు పూర్తిగా అవాస్తవం. తెలుగు చిత్రసీమలో నిలదొక్కుకోవడానికి జాన్వీ కపూర్ తెలుగులోని ఇద్దరు సూపర్‌స్టార్‌లతో బ్యాక్ టు బ్యాక్ సినిమాల్లో నటించడాన్ని ఎలా సద్వినియోగం చేసుకుంటుందో చూడాలి. మరోవైపు, మేకర్స్ ఈ చిత్రానికి కంపోజర్‌గా AR రెహమాన్‌ని లాక్ చేసారు మరియు మ్యూజిక్ సిట్టింగ్‌లు కూడా జరుగుతున్నాయి, దిగ్గజ సంగీత దర్శకుడు ఇప్పటికే రెండు ట్యూన్‌లు ఇచ్చారు.

## కేసీఆర్ కొన్ని చెబుతారు.. కొన్ని దాస్తారు: సీఎం రేవంత్



గత పదేళ్లలో కేంద్రంలోని భాజపాకు భారాస అండగా నిలిచిందని సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు. అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ సందర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్రం తీసుకొచ్చిన అన్ని బిల్లులకు గులాబీ పార్టీ మద్దతు పలికిందన్నారు. ఇరుపార్టీల నేతలు కలిసి పలుసార్లు చర్చించుకున్నారని చెప్పారు. "సీఎంను మార్చుకునే విషయం కూడా ప్రధాని మోదీ ఇక్కడికి వచ్చి చెప్పారు. కేసీఆర్ ఆ పార్టీల నేతలకు కొన్ని చెబుతారు.. కొన్ని దాస్తారు" అని ఎద్దేవా చేశారు.

మాకు ఎవరి అనుమతీ అక్కర్లేదు: పోచారం

దీనికి భారాస ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి బదులిస్తూ.. "అధికారం ఎవరికీ శాశ్వతం కాదు.. మీరిచ్చిన హామీలనే మీకు గుర్తు చేస్తున్నాం. హామీలన్నీ నెరవేరిస్తే మీకే మంచిపేరు వస్తుంది. సీఎంను మార్చేందుకు మాకు ఎవరి అనుమతీ అక్కర్లేదు. భాజపాతో మాకు ఎలాంటి సంబంధం లేదు" అని చెప్పారు.



## మదరసా కూల్చివేత.. ఉత్తరాఖండ్ హింసలో నలుగురు మృతి.. 250 మందికి గాయాలు

ఉత్తరాఖండ్‌లో మదరసా కూల్చివేత భారీ హింసకు దారి తీసింది. హల్ద్వాని జరిగిన ఆ హింసలో నలుగురు మృతిచెందారు. 250 మంది గాయపడ్డారు. ఈ ఘటన గురువారం జరిగింది. దీంతో ఆ సిటీలో కర్ఫ్యూ విధించారు. పరిస్థితి అదుపు తప్పిన నేపథ్యంలో అక్కడ కనిపిస్తే కాల్చివేత ఆదేశాలు జారీ చేశారు. అల్లర్లు కొనసాగుతున్న కారణంగా ఇంటర్నెట్ సేవల్ని రద్దు చేశారు. స్కూళ్లు, కాలేజీలను మూసివేశారు. కోర్టు ఆదేశాల ప్రకారం అక్రమంగా నిర్మించిన మదరసాను కూల్చివేసేందుకు ప్రభుత్వ అధికారులు ప్రయత్నించారు. భారీ పోలీసు బందోబస్తుతో అధికారులు ఆ ప్రాంతానికి వెళ్లారు. మదరసా, మసీదు అక్రమ స్థలంలో ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు. బుల్డోజర్‌తో కూల్చివేతకు దిగారు. హల్ద్వానిలోని వన్‌బుల్‌పురా ప్రాంతంలో ఉన్న జనం ఒక్కసారిగా ఎదురుతిరిగారు. దీంతో అక్కడ హింస చోటుచేసుకున్నది. ప్రభుత్వ అధికారులు, మున్సిపల్ వర్కర్లు, జర్నలిస్టులు గాయపడ్డవారిలో ఉన్నారు. దాడికి దిగిన వారిని అసాంఘీక శక్తులుగా అభివర్ణించారు. మదరసా కూల్చివేత ఘటనను అడ్డుకునేందుకు వచ్చిన వాళ్లు రాళ్లతో దాడి చేశారు. దీంతో పోలీసులు టియర్ గ్యాస్ ప్రయోగించారు. పోలీసు స్టేషన్ వద్ద ఉన్న వాహనాలకు ఆందోళనకారులు నిప్పుపెట్టారు. దీంతో శాంతి భద్రతలు మరింత బలహీనపడ్డాయి. మదరసా, మసీదును అక్రమ స్థలంలో కట్టారని, దాన్ని కూల్చివేయాలని కోర్టు ఇటీవల ఆదేశాలు ఇచ్చింది. ఆ ఆదేశాల ప్రకారమే ప్రభుత్వ అధికారులు పోలీసుల సాయంతో అక్కడకు వచ్చారు. కోర్టు ఆదేశాల ప్రకారమే తాము అక్కడకు వెళ్లినట్లు ఎస్పీ ప్రహ్లాద్ మీనా తెలిపారు. బుల్డోజర్ రంగంలోకి దిగడంతో.. అక్కడు ఉన్న స్థానికులు, మహిళలు వీధుల్లో ప్రదర్శనకు దిగారు. బారికేట్లను తొలగిస్తూ పోలీసులతో వాగ్వాదానికి దిగారు. దీంతో క్రమంగా అక్కడ పరిస్థితి సమస్యాత్మకంగా మారింది. ఆ సమయంలో జనం అధికారుల మీదకు రాళ్లు రువ్వారు. కోర్టు ఆదేశాలతోనే కూల్చివేత ప్రక్రియ జరిగినట్లు సీఎం పుష్కర్ సింగ్ ధామి తెలిపారు. సంఘవిద్రోహ శక్తులే అక్కడ హింసకు దిగినట్లు ఆయన ఆరోపించారు. గతంలోనే మసీదు, మదరసా ఉన్న ప్రాంతంలోని మూడు ఎకరాలను సీజ్ చేశామని మున్సిపల్ కమీషనర్ పంకజ్ ఉపాధ్యాయ తెలిపారు. ముందస్తు జాగ్రత్తగా నగరంలో కర్ఫ్యూ విధించినట్లు అధికారులు చెప్పారు.

## ఇరాన్ సుప్రీం లీడర్ ఖాతాలపై మెటా నిషేధం



ఇరాన్ సుప్రీం లీడర్ అయాతుల్లా అలీ ఖమేనీపై టెక్ దిగ్గజం మెటా కఠిన చర్యలు తీసుకుంది. ఆయన ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలను తొలగించింది. తమ కంటెంట్ విధానాలను పదేపదే ఉల్లంఘించినందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. ఇజ్రాయెల్‌పై హమాస్ మిలిటెంట్లు ఉగ్రదాడి జరిపిన దగ్గరి నుంచి ఈ సుప్రీం లీడర్‌పై నిషేధం విధించాలంటూ మెటాపై ఒత్తిడి వచ్చింది. హమాస్ జరిపిన విధ్వంసానికి ఖమేనీ మద్దతు ఇవ్వడమే గాకుండా.. గాజాలో ఇజ్రాయెల్‌కు వ్యతిరేకంగా మిలిటెంట్ల చర్యలను, ఎర్రసముద్రంలో నౌకలపై హూతీల దాడులను సమర్థిస్తూ వ్యాఖ్యలు చేశారు. అక్టోబర్ 7న ఇజ్రాయెల్‌పై జరిగిన దాడి వెనక మాత్రం తమ పాత్ర లేదని వివరణ కూడా ఇచ్చుకున్నారు. ఈ క్రమంలోనే ఆయన ఖాతాలపై నిషేధం విధించిన మెటా.. ఇజ్రాయెల్-హమాస్ యుద్ధం ప్రస్తావన మాత్రం తీసుకురాలేదు. 30 ఏళ్లకు పైగా ఇరాన్‌లో అధికారంలో ఉన్న ఖమేనీకి ఇన్‌స్టాగ్రామ్‌లో 50 లక్షల మంది ఫాలోవర్లు ఉన్నారు. ఇరాన్‌లో ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌పై ఆంక్షలు ఉన్నాయి. అక్కడి ప్రజలు వర్చువల్ ప్రైవేటు నెట్‌వర్క్స్ ద్వారా ఈ మాధ్యమాలను ఉపయోగించుకుంటున్నారు.

## కాంగ్రెస్ గూటికి పట్నం మహేందర్‌రెడ్డి

మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, ఆయన భార్య, వికారాబాద్ జెడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డిలు కాంగ్రెస్‌లో చేరడం ఖాయమైంది. దీనిలో భాగంగా వీరిద్దరూ రేపు(శనివారం) ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గేను కలవనున్నారు. రేపు ఖర్గే సమక్షంలో మహేందర్‌రెడ్డి దంపతులు కాంగ్రెస్ పార్టీలో చేరనున్నారు. గురువారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఆయన నివాసంలో కలిసి శాలువా, బొకేలతో సన్మానించారు.మహేందర్‌రెడ్డి మద్దతు దారులు చాలా మంది ఇప్పటికే కాంగ్రెస్‌లో చేరారు. తాండూరు నియోజకవర్గంలో మున్సిపల్ చైర్‌పర్సన్ తాటికొండ స్వప్న, సీనియర్ నాయకులు రవి గౌడ్, కరణం పురుషోత్తంరావ్ తదితరులు పట్నం వెంట వెళ్లనున్నట్లు తెలుస్తోంది.



ఎన్నికలకు ముందే వెళ్లాలని భావించినా.. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికలకు ముందే పట్నం మహేందర్‌రెడ్డి దంపతులు కాంగ్రెస్‌లో చేరతారని జోరుగా ప్రచారం సాగింది. అప్పట్లో కేసీఆర్ నేరుగా రంగంలోకి దిగి బుజ్జగించటంతో పాటు చివరి నిమిషంలో మంత్రి పదవి కట్టబెట్టడంతో ఆ నిర్ణయాన్ని వాయిదా వేసుకున్నారు. మాజీ ఎమ్మెల్యేలు పైలెట్ రోహిత్‌రెడ్డి, మెతుకు ఆనంద్‌తో నెలకొన్న విభేదాలు తీవ్రరూపం దాల్చడంతో కొద్ది నెలలుగా బీఆర్ఎస్‌కు అంటీముట్టనట్లు ఉంటున్నారు.



## ప్రధాని మోదీతో సీఎం జగన్ భేటీ

ప్రధాన మంత్రి నరేంద్ర మోదీతో సీఎం వైఎస్ జగన్ సమావేశం కానున్నారు. రాష్ట్రానికి రావాల్సిన నిధులు, పలు అభివృద్ధి అంశాలపై చర్చించేందుకు సీఎం జగన్ గురువారం రాత్రి ఢిల్లీ వచ్చారు. శుక్రవారం ఉదయం 11గంటల ప్రాంతంలో ప్రధాని మోదీతో సీఎం జగన్ సమావేశం కానున్నారు. అనంతరం కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్‌తో సీఎం జగన్ సమావేశం అవుతారు. సీఎం జగన్ గురువారం సాయంత్రం 5.30 గంటలకు తాడేపల్లిలోని నివాసం నుంచి గన్నవరం విమానాశ్రయానికి చేరుకొని, అక్కడి నుంచి ఢిల్లీకి వచ్చారు. ఆయన వెంట రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ లోక్‌సభా పక్ష నేత మిథున్‌రెడ్డి, పలువురు ఉన్నతాధికారులు ఉన్నారు. సీఎంకు ఢిల్లీ విమానాశ్రయంలో సీఎంకు వైఎస్సార్‌సీ పార్లమెంటరీ పార్టీ నేత, రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి, ఎంపీలు ఆర్.కృష్ణయ్య, నందిగం సురేష్, రెడ్డప్ప, అయోధ్య రామిరెడ్డి, వంగా గీత, చింతా అనురాధ, గొడ్డేటి మాధవి, గోరంట్ల మాధవ్, ఎం.గురుమూర్తి, బెల్లాన చంద్రశేఖర్ తదితరులు ఘన స్వాగతం పలికారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనులను సత్వరమే పూర్తి చేసేందుకు కేంద్రం తగిన సహాయ సహకారాలను అందించాలని, తెలంగాణ డిస్కంల నుంచి రావాల్సిన విద్యుత్తు బకాయిలు, విభజన సమయంలో పార్లమెంట్ సాక్షిగా ఇచ్చిన హామీల అమలు, ఇతర అభివృద్ధి కార్యక్రమాలపై సీఎం జగన్ ప్రధానితో చర్చించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. కేంద్ర హోం మంత్రి అమిత్ షా, ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌లను సైతం కలిసి రాష్ట్రానికి సంబంధించిన అంశాలపై చర్చించనున్నట్లు సమాచారం. ప్రధాని మోదీతో భేటీలో రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలపై ముఖ్యమంత్రి జగన్ చర్చించే అవకాశం ఉంది.

## పాపం పూజా హెగ్డే..



ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిపోయింది. డేట్స్ ఇద్దాం అంటే చేతిలో ఒక్క సినిమా కూడా లేదు. ఇండస్ట్రీలో ఇంత ఫాస్ట్‌గా పరిణామాలు మారిపోతాయని బహుశా పూజా హెగ్డే కూడా ఊహించి ఉండదు.ఎందుకంటే స్టార్ హీరోయిన్ హోదా ఉన్నా ఒక్క ఆఫర్ కూడా చేతిలో లేకపోవడంతో.. ఏం చేయాలో తెలియక సోషల్ మీడియాలో హాట్ హాట్ ఫోటోషూట్స్ చేసుకుంటూ బిజీ అయిపోయింది బుట్టబొమ్మ. తెలుగులో అయితే ఈమె పరిస్థితి మరీ దారుణంగా ఉంది. ఒప్పుకున్న సినిమాలు మొదలు కావడం లేదు.. మొదలైన సినిమాలు మధ్యలోనే ఆగిపోతున్నాయి. ఆ మధ్య మహేశ్ బాబు గుంటూరు కారం సినిమా నుంచి పూజా హెగ్డేను తప్పించారు. డేట్స్ ఇష్యూ రావడంతో ఒక షెడ్యూల్ తర్వాత ఆమె ప్లేస్‌ను శ్రీ లీల రీప్లేస్ చేసింది. దానికి ముందు విజయ్ దేవరకొండ, పూరీ జగన్నాథ్ కాంబినేషన్‌లో మొదలైన జనగణమన సినిమా కూడా ఒక షెడ్యూల్ తర్వాత ఆపేశారు.

## రాజ్యసభకు వైసీపీ అభ్యర్థులుగా వైవీ సుబ్బారెడ్డి, రఘునాథరెడ్డి, బాబూరావు



ఎవరేమనుకుంటే మనకేంటి అన్నట్లుగా వ్యవహరిస్తోంది వైసీపీ అధిష్ఠానం. 2019లో అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రభుత్వంలో, సంస్థాగత పదవుల్లో ఒకే సామాజికవర్గానికి అగ్ర ప్రాధాన్యమిస్తున్న ఆ పార్టీ.. తాజాగా రాజ్యసభ అభ్యర్థుల ఎంపికలోనూ అదే ఒరవడి కొనసాగించింది. ఉన్న మూడు సీట్లలో రెండు సీట్లను తమ ప్రాధాన్య సామాజికవర్గానికే కేటాయించుకుంది. మొదట బలిజ(కాపు) వర్గానికి చెందిన చిత్తూరు ఎమ్మెల్యే శ్రీనివాసులును ఎంపిక చేసినప్పటికీ ఆయన్ను తప్పించేశారు. అప్పట్లో ఆయనకు ఎమ్మెల్యే సీటు కాదని, రాజ్యసభ హామీ ఇచ్చారు. ఇప్పుడు శ్రీనివాసులుకు రాజ్యసభ అవకాశం ఇవ్వకపోగా, ఎమ్మెల్యే సీటూ లేకుండా పోయింది. ఆయన స్థానంలో మేడా రఘునాథరెడ్డిని ఎంపిక చేశారు. నియోజకవర్గాల సమన్వయకర్తల మార్పుల్లో భాగంగా రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి స్థానంలో ఉమ్మడి కడప జడ్పీ ఛైర్మన్ ఆకెపాటి అమర్నాథ్‌రెడ్డిని ఇటీవల నియమించారు. ఎమ్మెల్యే సీటు పోయినందుకు మల్లికార్జునరెడ్డికి ప్రత్యామ్నాయం చూపేందుకు ఆయన సోదరుడైన రఘునాథరెడ్డిని ఏకంగా రాజ్యసభ అభ్యర్థిగా ఎంపిక చేశారు.

అభ్యర్థులు వీరే: రాజ్యసభ ఎన్నికలకు వైసీపీ అభ్యర్థులుగా వైవీ సుబ్బారెడ్డి, మేడా రఘునాథరెడ్డి, గొల్ల బాబూరావు (పాయకరావుపేట ఎమ్మెల్యే)లను ముఖ్యమంత్రి జగన్ ఎంపిక చేశారు. ఈ ముగ్గురు జగన్‌ను అసెంబ్లీలోని ఆయన ఛాంబర్‌లో కలిసి ధన్యవాదాలు తెలిపారు. 12న నామినేషన్ దాఖలు చేయనున్నారు.




## ఇండియా vs ఆస్ట్రేలియా ఫైనల్ పోరు

భారత్, ఆస్ట్రేలియా మధ్య మరో కీలకపోరుకు రంగం సిద్ధమైంది. అయితే ఈసారి పోరు సీనియర్ల మధ్య కాదు జూనియర్ల మధ్య. అండర్ 19 వరల్డ్‌కప్-2024 ఫైనల్లో టీమిండియా, ఆస్ట్రేలియా జట్లు అమీతుమీ తెల్చుకోన్నాయి. శుక్రవారం జరిగిన రెండో సెమీఫైనల్లో పాకిస్తాన్‌పై ఒక్క వికెట్ తేడాతో విజయం సాధించిన ఆసీస్.. తమ ఫైనల్ బెర్త్‌ను ఖారారు చేసుకుంది. అంతకముందు తొలి సెమీ ఫైనల్లో దక్షిణాఫ్రికాను ఓడించిన యువ భారత్.. 9వ సారి ఫైనల్లో అడుగుపెట్టింది. అండర్-19 వరల్డ్‌కప్‌లో ఆస్ట్రేలియా ఫైనల్‌కు చేరడం ఇది ఆరోసారి. ఫిబ్రవరి 11న సౌతాఫ్రికా బినోని స్టేడియం వేదికగా ఫైనల్ మ్యాచ్ జరగనుంది.

### జూనియర్లు ప్రతీకారం తీర్చుకుంటారా?

కాగా గత ఏడాదికాలంలో ఐసీసీ ఈవెంట్ ఫైనల్లో భారత్- ఆస్ట్రేలియా తలపడడం ఇది ముచ్చటగా మూడో సారి. గత రెండు ఈవెంట్ (డబ్ల్యూటీసీ 2023, వన్డే వరల్డ్‌కప్ 2023)ల్లోనూ ఆసీస్ గెలుపొంది.. భారత అభిమానుల ఆశలపై నీళ్లు జల్లింది. ఈ క్రమంలో కనీసం యువ భారత జట్టు అయినా ఫైనల్లో ఆసీస్‌ను ఓడించి ప్రతీకారం తీర్చుకోవాలని 140 కోట్ల మంది అభిమానులు భావిస్తున్నారు. మరి భారత్ ప్రతీకారం తీర్చుకుంటుందా లేదా మరోసారి దాసోహం అంటుందా అన్నది ఆదివారం వరకు వేచి చూడాలి.

### కంగారులపై మనదే పై చేయి..

ఇక అండర్-19 వరల్డ్‌కప్‌లో మాత్రం కంగారులపై టీమిండియాదే పై చేయి. ఈ మెగా ఈవెంట్ ఫైనల్ పోరులో భారత్-ఆస్ట్రేలియా తలపడడం ఇది మూడో సారి. 2003 అండర్-19 వరల్డ్‌కప్ ఫైనల్లో తొలిసారిగా ఆసీస్- టీమిండియా తలపడ్డాయి. ఈ టోర్నీలో ఆసీస్ జట్టు కెప్టెన్‌గా రికీ పాంటింగ్ వ్యవహరించగా.. భారత జట్టును సౌరవ్ గంగూలీ ముందుకు నడిపించాడు. అయితే ఫైనల్ మ్యాచ్‌లో 125 పరుగుల తేడాతో భారత్‌ను ఆసీస్ చిత్తు చేసింది. కానీ ఆ తర్వాత టోర్నీల్లో మాత్రం భారత్ జూలు విధిల్చింది. అనంతరం మళ్లీ 9 ఏళ్ల తర్వాత 2012 వరల్డ్‌కప్ ఫైనల్లో ఆసీస్- భారత్ అమీతుమీ తెల్చుకున్నాయి. ఈ ఫైనల్ మ్యాచ్‌లో ఉన్ముక్త్ చంద్ నేతృత్వంలోని భారత జట్టును ఆసీస్‌ను ఓడించి టైటిల్‌ను ముద్దాడింది. అదే విధంగా 2018 వరల్డ్‌కప్ తుదిపోరులోనూ యువ భారత్ మట్టికరిపించింది. ఈ సారి కూడా అదే ఫలితం పునరావృతం అవుతుందని భారత అభిమానులు గట్టిగా నమ్ముతున్నారు.

### అద్భుత ఫామ్‌లో భారత్..

కాగా ప్రస్తుతం భారత జట్టు ఫామ్‌ను చూస్తుంటే ఆసీస్‌ను ఓడించి మరోసారి టైటిల్‌ను ఎగరేసుకోపోయేలా కన్పిస్తోంది. ఈ టోర్నీలో భారత్ ఒక్క మ్యాచ్‌లో కూడా ఓడిపోకుండా ఫైనల్స్ చేరింది. భారత కెప్టెన్ ఉదయ్ సహారాన్, ముషీర్ ఖాన్, సచిన్ దాస్ వంటి యువ సంచలనాలు అద్భుత ఫామ్‌లో ఉండడం జట్టుకు కలిశిచ్చే అంశం. మరోవైపు బౌలర్లలో రాజ్ లింబానీ మరోసారి చెలరేగితే ఆసీస్ బ్యాటర్లకు కష్టాలు తప్పవు. అయితే ఆసీస్‌ను మాత్రం తక్కువగా అంచనా వేయలేం. ఫైనల్ అంటే ఆసీస్‌కు పూనకాలే. పరిస్థితులు ఎలా ఉన్న ఆఖరి వరకు పోరాడడమే ఆసీస్ ప్రధాన అస్త్రం.